

ప్రజాశక్తి
శనివారం 20 జులై 2024
5
విజయనగరం



బాధ్యతలు స్వీకరించిన ఇన్‌ఛార్జి విసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విజయనగరం యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయ సుమ , వివిధ విభాగాల డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, వివిధ విభాగాల అధిపతులు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విసి మాట్లాడుతూ, యూనివర్సిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. సిబ్బంది అందరూ సహాయ సహకారాలు అందిస్తూ పని చేయాలని కోరారు. ఎటువంటి సమస్యలున్నా తనకు తెలియజేయాలని కోరారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న విసి రాజ్యలక్ష్మి

ముసురుకుంది

● జిల్లా వ్యాప్తంగా చెదురుమదురు వర్షాలు ● 137 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు ● అత్యధికంగా పూసపాటిరేగలో 17 సెం.మీ

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో గత రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 137 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పూసపాటిరేగ మండలంలో 175.2మి.మీ., భోగాపురం మండలంలో 153.8మి.మీ, డెంకాడ మండలంలో 76.3మి.మీ, వర్షం కురిసింది. వర్షాలతో పంట పొలాల్లో భారీగా నీరు చేరింది. పలుచోట్ల పాఠశాలల ఆవరణల్లో భారీగా నీరు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు చేరడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వర్షాలతో పువ్వు దశలో ఉన్న నువ్వుపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరినారు ఎదుగుదలకు వర్షాలు ఉపయోగపడతాయని రైతులు అంటున్నారు. ఈనేపథ్యంలో ఎరువుల కోసం రైతు భరోసా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఇదిలా ఉండగా, శనివారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

– ప్రజాశక్తి, విలేకర్ల బృందం

నేడు విద్యాసంస్థలకు సెలవు

విజయనగరంటౌన్ : జిల్లాలో శనివారం భారీవర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్న కలెక్టర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డెంకాడ మండలం పినతాడివాలో వరినారు పొలాలను ముంచెత్తిన వరద



వర్షపాతం వివరాలు

వంగర	28.4
రేగిడి	32.8
సంతకవిటి	21.6
రాజాం	32.0
బొబ్బిలి	10.1
రామభద్రపురం	17.4
బాడంగి	12.8
తెర్లాం	19.2
మెరకముడిదాం	34.3
దత్తిరాజేరు	26.2
మెంటాడ	20.4
గజపతినగరం	32.5
గరివిడి	65.4
చీపురుపల్లి	73.9
గుర్ల	73.0
బొండపల్లి	29.3
గంట్యాడ	48.4
ఎస్.కోట	43.4
వేపాడ	54.4
ఎల్.కోట	43.6
కొత్తవలస	56.2
జామి	52.2
విజయనగరం	72.4
నెల్లిమర్ల	69.0
పూసపాటిరేగ	175.2
డెంకాడ	76.3
భోగాపురం	153.6

రిజర్వాయర్ల నీటి మట్టాలు

రిజర్వాయరు	కెపాసిటీ	ప్రస్తుత నీటిమట్టం
తాటిపూడి	297 అడుగులు	289 అడుగులు
మడ్డువలస	65 మీటర్లు	63.52 మీటర్లు
వట్టిగెడ్డ	121.62 మీటర్లు	115.52 మీటర్లు
ఆండ్ర	146 మీటర్లు	140.48 మీటర్లు

నీటమునిగిన పంట పొలాలు

డెంకాడ : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. మండలంలో 76.3 మి.మీ వర్షం కురిసింది. దీంతో పినతాడివాడ గ్రామంలో ఊర చెరువు ఆయకట్టు కింద ఉన్న 93ఎకరాలు నీట మునిగి చెరువును తలపించింది. మరోవైపు అక్కడక్కడా వేసిన నువ్వు పంట దెబ్బతింది. వరినాట్లు వేసేందుకు ఈ వర్షం దోహదపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులా పాఠశాల


వర్షపునీటిలో నుంచి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

భోగాపురం : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భోగాపురంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణం పూర్తిగా జలమయమైంది. పాఠశాల గేటు వద్ద వర్షం నీరు పూర్తిగా నిలిచిపోయింది. ఆ వర్షపు నీటిలో నుంచి విద్యార్థులు పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై స్పందించిన గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి ఇఒ మొంగం సురేష్, గ్రామ పెద్దలు కలిసి వర్షపు నీరు బయటకు వెళ్లేలా జెసిబితో కాలువ తవ్వారు. ఇక్కడ గత కొన్నేళ్ల నుంచి సమస్య ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఎప్పుడు వర్షాలు పడినా వర్షపునీరు బయటకు వెళ్లకుండా పాఠశాలలోనే ఉండిపోతోంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నిలిచిన ఎయిర్‌పోర్టు పనులు

పనుల వద్ద గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

భోగాపురం : మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం మట్టి పనులు చేపడుతున్నారు. వర్షానికి ఈ పనులు చేసేందుకు కుదరడం లేదు. నిర్మాణ ప్రాంతంలో నీరు నిల్వ ఉండిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో పనులు చేసేందుకు అవకాశం లేదు. ఆ నీటిని మోటార్ల సాయంతో ఖాళీ చేస్తే గాని పనులు ప్రారంభించే పరిస్థితి లేదు. దీంతో ఎక్కడి యంత్రాలు అక్కడే నిలిచిపోయాయి.

జమ్మయ్యపేట రహదారిలో నిలిచిపోయిన రాకపోకలు

విమానాశ్రయానికి ఆనుకొని ఉన్న జమ్మయ్యపేట రహదారిలో రాకపోకలు నిలిచి పోయాయి. విమానాశ్రయ ప్రహరీకి ఆనుకొని జమ్మయ్యపేటతోపాటు మరికొన్ని గ్రామాలకు వెళ్లేందుకు మట్టి రహదారిని అధికారులు నిర్మించారు. విమానాశ్రయం లోపల నుంచి వచ్చే వరద ఉధృతికి ఈ రహదారి కోతకు గురైంది. దీంతో నడిచి కూడా వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.


విమానాశ్రయ నిర్మాణాల లోపల నుంచి వస్తున్న నీటితో కొట్టుకుపోయిన రోడ్డు

తీర ప్రాంతంలో కూడా అధికారులు మత్స్యకారులను అప్రమత్తం చేశారు. వర్షాలు పడుతున్నందున వేటకు వెళ్లరాదని సూచించారు.


విమానాశ్రయ గుంతల్లో నీరు చేరడంతో నిలిచిపోయిన యంత్రాలు

ఊపందుకున్న ఉబాలు

వేపాడ : మండలంలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో జగ్గయ్యపేట గ్రామంలో ఉబాలు ఊపందుకున్నాయి. ప్రతి ఏటా జగ్గయ్యపేటలో తొలుత వరినాట్లు ప్రారంభిస్తారు. ఏమాత్రం వర్షం కురిసిన పొలాల్లోకి చేరు చేరడంతోపాటు బోరుబావులు ఎక్కువగా ఉండటమే అందుకు కారణం.


జగ్గయ్యపేటలో ఉబాలు పనుల్లో నిమగ్నమైన రైతులు

రోడ్డుపై కూలిన చెట్టు


చెట్టును తొలగిస్తున్న కూలీలు

బొండపల్లి : మండల సముదాయానికి సమీపంలో 26వ జాతీయ రహదారిపై శుక్రవారం చింతచెట్టు రోడ్డుకు అడ్డంగా పడింది. ఆ సమయంలో రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెట్టు మొదలు వద్ద మట్టి కరిగి పోయింది. దీంతో ఒక్కసారిగా చింత చెట్టు నేలకొరిగింది. చింత చెట్టు పక్కనే పలు షాపులు ఉన్నాయి. అటువైపు పడకపోవడంతో షాపుల్లో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎఎస్‌ఐ ఎల్.గోపీనాథం ఆధ్వర్యంలో పోలీస్‌సిబ్బంది, తహశీల్దార్ హనుమంతురావు, డిటి పప్పు హరి, ఆర్‌ఐ సతీష్ జెసిబితో రోడ్డుపై నుంచి చెట్టును తొలగించారు.

నిండుకుండలా మడ్డువలస

నిండుకుండలా ఉన్న మడ్డువలస ప్రాజెక్టు



వంగర : మడ్డువలస రిజర్వాయర్‌కు జలకళ వచ్చింది. నిండుకుండలా మారింది. అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 65 మీటర్లకు గాను శుక్రవారానికి 63.52 మీటర్లకు చేరింది.

నాగావళి నదిలో పెరిగిన నీటి ప్రవాహం

ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో నాగావళి నదిలో శుక్రవారం నీటి ప్రవాహం భారీగా పెరిగింది. గత కొన్నాళ్లుగా నాగావళి నదిలో నీరు భారీగా తగ్గిపోవడంతో శివ్వాం, తలగాం, రాజుల గుమ్మడ, ఓని అగ్రహారం రేవుల వద్ద వంగర మండలం, మన్యం జిల్లా వీరఘట్టం మండలాల ప్రజలు రాకపోకలు సాగించేవారు ప్రస్తుతం నీటి ప్రవాహం భారీగా పెరగడంతో నాగావళి రేవుల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి.

సిఆర్‌జెడ్ నోటిఫికేషన్ దోహదం

తీరప్రాంతాల అభివృద్ధికి

- పర్యాటక అభివృద్ధికి ఊతం
- ప్రజల అభిప్రాయాలను రాష్ట్ర స్థాయి కమిటీకి నివేదిస్తాం : జెసి కార్తీక్
- కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

సముద్రతీర ప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి, ఈ ప్రాంతంలో ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర నియంత్రణ నోటిఫికేషన్(సిఆర్‌జెడ్-2019) దోహదపడుతుందని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన తాజా నోటిఫికేషన్ మేరకు జిల్లాస్థాయి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాల్సి వుందని పేర్కొంటూ, ప్రజలు వ్యక్తంచేసే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే దీనిని రూపొందిస్తారని తెలిపారు. కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపకల్పన కోసం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తీర నియంత్రణ నోటిఫికేషన్‌పై ప్రజలు వ్యక్తంచేసే అభిప్రాయాలను రాష్ట్ర స్థాయిలో ఏర్పాటైన పర్యావరణ ప్రభావ అంచనా కమిటీకి నివేదిస్తామన్నారు. 2011 నాటి తీర నియంత్రణ చట్టంతో సరిపోల్చి చూస్తే 2019 నోటిఫికేషన్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు, పర్యాటక వసతులు కల్పించేందుకు ఎంతో అనుకూలంగా వుంటుందన్నారు. ప్రస్తుతం దేశంలో 2011 నాటి సి.ఆర్.జెడ్. నిబంధనలే అమలులో వున్నాయని, 2019 నోటిఫికేషన్‌కు అందరి ఆమోదం లభిస్తే ఇది అమలులోకి వస్తుందన్నారు. తాజా నోటిఫికేషన్ ద్వారా గతంలో కంటే సి.ఆర్.జెడ్. ప్రాంతాన్ని కుదించారని, తీరానికి మరింత దగ్గరగా బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మత్స్యకారుల ఆవాసాలు కూడా సముద్ర తీరానికి గతంలో కంటే మరింత సమీపంలో ఏర్పాటు చేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధి సుభాని మాట్లాడుతూ తీర నియంత్రణ నోటిఫికేషన్ వల్ల వివిధ రకాల అభివృద్ధి పనులకు, పర్యాటక వసతులకు, మత్స్యకారులకు లభించే వెసులుబాట్లను వివరించారు.

కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ సరిత మాట్లాడుతూ జిల్లాలోని తీరప్రాంత అభివృద్ధిలో భాగస్వాములైన వివిధ వర్గాల వారి అభిప్రాయాలను తెలుసుకొని జిల్లా కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందిస్తామని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ద్వారా నియమితులైన కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులు యోగరాజ్, కరుణానిధి సిఆర్‌జెడ్ లోని అనుకూలాంశాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన మత్స్యకార ప్రజా ప్రతినిధులు తీర నియంత్రణ చట్టంపై తమ అభిప్రాయాలను తెలిపారు. పలువురు ఎంపిటిసిలు, మాజీ స్థానిక ప్రతినిధులు మాట్లాడుతూ తీరప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న రసాయనిక, ఫార్మా పరిశ్రమల నుంచి విడుదల అవుతున్న కాలుష్య కారక వ్యర్థాల వల్ల సముద్రజలాలు కలుషితమై మత్స్య సంపద తగ్గిపోతోందని, తమ జీవన పరిస్థితులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మత్స్యకార ప్రతినిధులు బర్రి చిన్నప్పన్న, మైలపల్లి సింహాచలం, తాత, అప్పలసూర్యనారాయణ, నూకరాజు, ఎంపిటిసి పతివాడ అప్పలనాయుడు తదితరులు మాట్లాడారు.

జిందాల్ చర్చలు సఫలం

ఫలించిన కార్మిక సంఘాల పోరాటం

ప్రజాశక్తి-కొత్తవలస

64 రోజుల క్రితం లాకౌట్ విధించిన జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారాన్ని తెరిచేందుకు యాజమాన్యం ఎట్టకేలకు అంగీకరించింది. శుక్రవారం పరిశ్రమలో రెండు దఫాలుగా కార్మిక సంఘాలకు, యాజమాన్యానికి జరిగిన చర్చలు సఫలమయ్యాయి. యాజమాన్యం పరిశ్రమకు లాకౌట్ విధించడంతో కార్మికులంతా ఉపాధి కోల్పోయారు. దీంతో కంపెనీ వద్ద 33 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేశారు.పలు రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. యాజమాన్యంతో పలు దఫాలు చర్చలు జరిగినప్పటికీ విఫలమయ్యాయి. చివరికి శుక్రవారం జరిగిన చర్చలు సత్ఫలితాలిచ్చాయి. లే ఆఫ్ కాలానికి కాంట్రాక్టుకార్మికులకు రూ.6500, అడ్వాన్సు కింద మరో రూ.5వేలు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. కంపెనీ తెరిచిన తరువాత 20 రోజులు పాటు పని కల్పిస్తామని, ఫ్యాక్టరీని ఎప్పుడు తెరుస్తామన్నది తరువాత తెలియజేస్తామని యాజమాన్యం పేర్కొంది. ముడిసరుకును సమకూర్చుకున్న తరువాత కార్మికులందరికీ పూర్తి స్థాయిలో పని కల్పిస్తామని తెలిపింది. ఇందుకు కార్మికసంఘాలు అంగీకరించాయి. చర్చల్లో సిఐటియు నాయకులు నమ్మి చినబాబు, బి.ఈశ్వరరావు, బి.రాము, వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు నెక్కల నాయుడుబాబు, టిఎన్‌టియుసి నాయకులు పిల్లా అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

విజయనగరం టౌన్ : నియోజకవర్గంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజును కోరారు. శుక్రవారం అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యేను కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్, మాట్లాడారు. 2019లో జిల్లాకు కేటాయించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటికీ సొంత భవనం నిర్మించలేదని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటికీ తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకుండా పోయిందని తెలిపారు. సంక్షేమ హాస్టల్లో గత తొమ్మిది నెలలుగా బకాయిలు పేరిగిపోయాయని, దీంతో వార్డెన్లు సరిగా భోజనం అందించలేక పోతున్నారని తెలిపారు. నగరంలోని బిపిఎం, కస్పా, గాజులరేగ హైస్కూళ్లలో సౌకర్యాల కొరత దారుణంగా ఉందని అన్నారు. వీటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవి కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్, మురళి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత

ఎస్‌పి వకుల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి, పోలీసు సిబ్బంది సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది ఒక్కొక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడి శాఖాపరమైన సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిశీలించి, పరిష్కరించే ందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ కెకెవి విజయనాథ్ పాల్గొన్నారు.

పోలీసు విభాగాలు పరిశీలన

జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ జిల్లా కేంద్రంలోని పలు పోలీసు విభాగాలను సందర్శించి, వాటి పని తీరును పరిశీలించారు. జిల్లా పోలీసు కార్యాలయం, రిసెప్షన్, డిసిఆర్బి, ఆర్మ్డ్ రిజర్వు, బాంబ్ డిస్పోజల్ విభాగం, ఆర్మ్ డ్ రిజర్వు, స్పెషల్ బ్రాంచ్, పాస్పోర్టు విభాగం, క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్ బ్యూరో, సమావేశ మందిరం, ఎస్‌సి,ఎస్‌టిసెల్, టాస్క్‌ఫోర్సు కమాండ్ కంట్రోల్, కో-ఆపరేటివ్ సొసైటీ, ఐటి కోర్, వైర్‌లెస్ స్టేషను వంటి విభాగాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఆయా కార్యాలయ విభాగాల పనితీరును, ఎంతమంది సిబ్బంది, ఎప్పటి నుండి పని చేస్తున్నది, ఏ తరహా విధులు నిర్వహిస్తున్నది సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం, కార్యాలయాల పని తీరును మెరుగుపర్చేందుకు పలు సూచనలు చేసి, వాటిని వెంటనే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్వీన్, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఎస్‌బి సిఐలు కెకెవి విజయనాథ్, ఇ.నర్సింహమూర్తి, పలువురు ఎస్‌ఐలు, పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి జిందాల్

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను తక్షణమే ఆపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. రెవిన్యూ వారు కేసు లు పెడుతున్నప్పటికీ పోలీస్ శాఖ చర్యలు తీసుకోవడం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ ఆయన ఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీ సభ్యులంతా క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేయాలని రవాణా అధికారులకు ఆదేశించారు. తక్షణమే సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని మైన్స్ డి డి కు ఆదేశించారు. పోలీస్, రెవిన్యూ, మైన్స్, రవాణా శాఖల అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో ట్రాక్టర్లతో అమ్మకుండా చూడాల్సిన బాధ్యత విఆర్ఒలదేనని తెలిపారు. ఒక గ్రామం నుండి వేరొక గ్రామానికి ట్రాక్టర్ల ద్వారా తరలించ కుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జెసి కార్తీక్, ఆర్‌డిఒలు సూర్యకళ, శాంతి , సాయిశ్రీ, అదనపు ఎస్‌పి అసమా ఫర్వీన్, పిసిబి డిడి సరిత, మైన్స్ డిడి సూర్య చంద్రరావు, భూగర్భ జల శాఖ డిడి దుర్గ ప్రసాద్, ట్రాన్‌పోర్టు, పంచాయతీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎపిఐఐసి భూములపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

ఎపిఐఐసికి కేటాయించిన భూములపై సమగ్ర నివేదికనివ్వాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. క్లియర్ గా ఉన్న భూములను ఎపిఐఐసికి అప్పగించాలని, మిగిలిన భూముల వివరాలను , ప్రస్తుతం వాటి స్టేటస్ ను తెలుపుతూ వారం రోజుల్లో నివేదికనివ్వాలని తెలిపారు. తన ఛాంబర్‌లో ఎపిఐఐసి, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇదివరకు ఎపిఐఐసికి కేటాయించిన 250 ఎకరాల భూములను ఏ విధంగా అభివృద్ధి చేసిందీ, ఎలాంటి చర్యలు తీసుకున్నది ఆ శాఖ అధికారులను అడిగారు. ఎపిఐఐసికు వినియోగపడని, వారు చెల్లింపులు చేయని భూములను విత్ డ్రా చేసుకోవాలని తెలిపారు. భూములు ఇచ్చే పరిస్థితి లేనిచోట వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని అన్నారు. సమావేశంలో జెసి కార్తీక్, ఆర్‌డిఒలు సూర్య కళ, శాంతి, సాయి శ్రీ, తహశీల్దార్లు, ఎపిఐఐసి అధికారులు పాల్గొన్నారు.

సొంత జిల్లాలకు తహశీల్దార్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల ముందు వేర్వేరుజిల్లాలకు బదిలీ అయిన తహశీల్దార్లను సొంత జిల్లాలకు పంపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులుజారీ చేసింది. ఇటీవల జరిగిన సార్వత్రి ఎన్నికల్లో ఒకజిల్లాలో పనిచేస్తున్న తహశీల్దార్లకు వేరే జిల్లాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అలా బదిలీ అయిన వారంతా ఈ ఉత్తర్వులతో వారు గతంలో పనిచేసిన జిల్లాలకు రానున్నారు.

వైసిపి పాలనంతా కబ్జాలమయం

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-కొత్తవలస



ఐదేళ్ల వైసిపి పాలనంతా కబ్జాలమయం అయిందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. శుక్రవారం లక్కవరపుకోటలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల ఆమె మాట్లాడారు. విశాఖపట్నంలో గత ఐదేళ్లలో అనేక భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. విశాఖలో రామానాయుడు స్టూడియో భూములను, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హయగ్రీవ భూములను, దసపల్లా భూములను కొట్టేశారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, మాజీ జెడ్‌పిటిసిలు కరెడ్ల ఈశ్వరరావు, కోళ్ల శ్రీను, మాజీ ఎంపిపి కొల్లి రమణ మూర్తి, నాయకులు కొట్యాడ ఈశ్వరరావు, ఎర్నాయుడు, తిక్కాన దేముడు పాల్గొన్నారు.

వేలం రద్దు చేయాలి

ప్రజాశక్తి-గజపతినగరం

దేవాదాయ భూముల కౌలుకు వేల వేయడం దారుణమని, వెంటనే రద్దు చేయాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పాత శ్రీరంగరాజపురం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతశ్రీరంగరాజపురంలో సుమారు వందేళ్ల నుంచి 50 ఎకరాలను 30 మంది రైతులు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం వాటిని వేలం వేయడం దారుణమన్నారు. వెంటనే దాన్ని రద్దు చేయాలని, ప్రస్తుతం సాగుచేస్తున్న రైతులకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాస నాయకులు పంటల అప్పలనాయుడు, బూడి అప్పలనాయుడు, పరువుల సత్యనారాయణ, బోండా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఉద్యోగికి ఎట్టకేలకు న్యాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం రూరల్ డివిజన్ వేపాడ సెక్షన్‌లో గొర్రిపాటి లీలా కుమార్ ఎనర్జీ అసిస్టెంట్ గా ఎన్ కె అర్ పురం సచివాలయంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ 11 కెవి లైన్ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఎడమ చేయి కాలిపోవడం వలన మోచేయి వరకు తీసేశారు. ఈ విషయమై ఎపిఇ ఇ.యూనియన్ 1104 విజయనగరం రీజనల్ నాయకులు విజయనగరం ఎస్ఇ మువ్వల లక్ష్మణరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విచారణ చేయించి సిఎమ్‌డికి నివేదించారు. లీలాకుమార్ కుమార్ కూడా నేరుగా సిఎండిని కలసి తనకు జరిగిన అన్యాయాన్ని తెలిపారు. దీంతో ఆయన స్పందించి వర్క్‌మెన్ పరిహారం, స్పెషల్ డిజబిలిటీ లీవ్, మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్, ఫీల్డ్ నుండి ఆఫీస్‌కు బదిలీ మొదలగు అనుమతులు మంజూరు చేశారు. ఈనేపథ్యంలో లీలాకుమార్ సిఎండికి, ఎస్ఇకి, 1104 నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

కాలువల్లో పూడికలు తీయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

కాలువల్లో పూడికలు తీసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు కోరారు. శుక్రవారం బొబ్బిలిలో వారు విలేకరులతో మాట్లాడారు. వేసవిలో సాగునీటి కాలువల్లో పూడికలు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా పట్టించుకోలేదన్నారు. కాలువల్లో పూడికలు తీయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వగా రూ.4.30 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారని, తక్షణమే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.

గ్యాస్ వినియోగదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్యాస్ వినియోగదారులకు ఇకెవైసి తప్పనిసరని రేణు గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ శాంతకుమారి తెలిపారు. ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజనా పథకం వినియోదారుల్లో రేషన్ కార్డు ఉన్న వారంతా ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. ఏజెన్సీ పరిధిలోని కొన్ని గ్రామాల్లో స్థానికంగానే ఇకెవైసి చేయించే ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమ కార్యాలయం వద్ద రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నా ఒక గంట వరకు, మళ్లీ 3 గంటల నుంచి 4 గంటల వరకు నమోదు చేస్తామని తెలిపారు. వినియోగదారులకు రక్షణ నిమిత్తం సురక్ష ట్యూబ్ కేవలం రూ.150కే ఇస్తున్నామని చెప్పారు.

వసతిగృహం పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురంలోని బిసి బాలుర వసతిగృహాన్ని జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.సందీప్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం విద్యార్థులు ఉంటున్న వసతిగృహం శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలోకి మార్చాలని వార్డెన్ శరణ్మయికి సూచించారు. అనంతరం భోగాపురం పరిసర ప్రాంతంలోని కొన్ని ప్రయివేట్, ప్రభుత్వ భవనాలను వసతిగృహం కోసం పరిశీలించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో మాట్లాడి, అద్దె భవనం అందుబాటులో ఉంటే చూడాలని సూచించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రాజగిరి హరివిటల్, రాష్ట్ర కార్యదర్శి దుంపల వెంకట అప్పలనాయుడు తెలిపారు. అసోసియేషన్ ద్వారా కళాశాలలో నిర్వహించాలనుకున్న కార్యకలాపాల అనుమతుల కోసం శుక్రవారం జెఎన్‌టియుజివి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయ సుమని కలిశారు. జెఎన్‌టియు అనుబంధ కళాశాలలో నిర్వహించ బోతున్న కార్యకలాపాలకు అనుమతులు కోరగా, రిజిస్ట్రార్ అనుమతులు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు గొల్లపూడి పృథ్వీరాజ్ , గుడివాడ కళ్యాణి, జెఎన్‌టియు జివి స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎవి పాపారావు, పీడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు మందులు సిద్ధం

ప్రజాశక్తి-కొత్తవలస

వియ్యంపేట పిహెచ్‌సిలో పాముకాటుకు, కుక్కకాటుకు మందులు సిద్ధంగా ఉన్నట్లు డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం వియ్యంపేట పిహెచ్‌సిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది తప్పనిసరిగా జ్వరాలపై ఇంటింటి సర్వే చేయాలని, ప్రతిరోజూ రిపోర్ట్ పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఇఒ నరసింహారావు, హెచ్‌వి పద్మావతి, హెచ్ఎస్ ఈశ్వరరావు, ఎల్‌టి సంతోష్, సిబ్బంది ఆశాజ్యోతి, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నీలకంఠరాజపుర అగ్రహారం, డబ్బిరాజుపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం విద్యార్థి కిట్లు పంపిణీ చేశారు. నీలకంఠరాజపుర అగ్రహారంలో డిసిసిబి చైర్మన్ వివి చినరామినాయుడు, సర్పంచ్ జి.దేవి, వైస్ సర్పంచ్ కె.చిన్ననాయుడు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న డిసిసిబి చైర్మన్ చినరామినాయుడు

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-డెంకాడ

మండలాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషిచేస్తానన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రతి గురువారం మండలంలో ఒక గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. జనవాణి కార్యక్రమం మండలంలో వారానికి ఒకరోజు ఒక గ్రామంలో నిర్వహిస్తానని చెప్పారు. అందులో ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

సమావేశంలో జొన్నాడ వెల్‌నెస్ సెంటర్ వద్ద అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని మోపాడ పిహెచ్‌సి వైద్యాధికారి.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్య తేలేంత వరకు నిర్మాణాలు ఆపాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అక్కివరం ఎంపిటిసి సభ్యులు కంది చంద్రశేఖరరావు మాట్లాడుతూ మండలంలో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనివల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. తాగునీటిని పరీక్షించే కేంద్రం మండలంలో ఏర్పాటు చేయాలని కోరారు. నాతవలసలో పంచాయితీలో కరెంట్ బిల్లు కోసం విద్యుత్తు శాఖ రూ.10 లక్షలు పంచాయతీ నుంచి డ్రా చేశారని, మరో రూ.5 లక్షలు బకాయి ఉందని నోటీస్ ఇచ్చారని తెలిపారు. ఆ పంచాయతీలో ఉన్న సొమ్మును విద్యుత్తు శాఖ వారు తీసేయడంతో గ్రామంలో పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. హౌసింగ్ డిఇ మురళీధరరావు మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్మాణంలో ఉన్న ఇళ్లు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని, వాటికే బిల్లులు చెల్లింపు అవుతాయని తెలిపారు. తరువాత నుంచి బిల్లులు ఇవ్వడం కుదరదని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, వైస్ ఎంపిపిలు పిన్నింటి తమ్మునాయుడు, కె.అనిత, ఎంపిడిఒ లవరాజ్, తహశీల్దార్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

తంగుడుబిల్లి గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

నెల్లిమర్ల : మండలంలోని తంగుడుబిల్లి గ్రామ సమస్యలపై ఎంపిటిసి చందక చిన్నంనాయుడు.. ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి వినతిపత్రం అందజేశారు. ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు అసంపూర్తిగా ఉన్నాయని, రహదారి శిథిలావస్థకు చేరిందని వివరించారు. దేవస్థానం భూములు సాగుచేస్తున్న రైతులకు, కౌలురైతులకు పిఎం కిసాన్, అన్న దాత సుఖీ భావ వంటి పథకాలు అమలు చేయాలని కోరారు. తోటపల్లి కాలువను కాలంరాజుచెరువుకు అనుసంధానించి, సాగునీరు అందించాలని విజ్ఞప్తిచేశారు.

మా మధ్య విభేదాలు లేవు

మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు

ప్రజాశక్తి-డెంకాడ

నెల్లిమర్ల నియోజకవర్గంలో టిడిపి, జనసేన మధ్య ఎలాంటి విభేదాలూ లేవని టిడిపి సీనియర్ నేత, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టిడిపి నాయకుల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రెండు పార్టీల నేతలు కలిసే క్షేత్రస్థాయిలో పథకాల అమలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

పిటిసి ప్రిన్సిపల్‌కు సన్మానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ టి.ఆనంద బాబును శుక్రవారం జిల్లా బిసి సంక్షేమ సంఘం నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆయన చేసిన సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కెల్ల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి బుజ్జిబాబు, హరిబాబు, శంకర రావు పాల్గొన్నారు

కోర్టు భవనానికి నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-బొబ్బిలి

కోర్టు సముదాయ భవనానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని న్యాయవాదులు.. ఎమ్మెల్యే బేబినాయనను కోరారు. శుక్రవారం కోటలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని బేబినాయన హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు న్యాయవాదుల వినతి

ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మోహన్ మురళీకుమార్, కార్యదర్శి కొల్లి సింహాచలం, సీనియర్ న్యాయవాదులు కె.ప్రసాదరావు, జి.గోపాలకృష్ణ శర్మ, అమరాపు రామకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహావిష్కరణ

స్థానిక యాదవవీధి జంక్షన్లో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ఆవిష్కరించారు. యాదవవీధికి చెందిన యువకుడు ఎన్.మాధవ్ సొంత నిధులతో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి యువత పని చేయాలని బేబినాయన, మాధవ్ కోరారు.

సిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. 8 మంది వైద్యులకు గాను విధుల్లో ఇద్దరు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ఉదయం 10 గంటలకు వచ్చి 12 గంటలకు వెళ్లిపోతున్నారని, సూపరింటెండెంట్ కూడా అందుబాటులో ఉండటం లేదని, రోగులకు అత్యవసర, సాధారణ వైద్యం సరిగా అందడం లేదని గుర్తించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యులు ఇలా విధులకు హాజరు కాకుంటే ఎలా అని ప్రశ్నించారు. తీరు మారకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు, డయేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



రోగులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సరోజిని

కార్యక్రమంలో టిడిపి పార్లమెంటు కార్యదర్శి లెంక అప్పలనాయుడు, జనసేన పార్టీ నాయకులు బంగారు శంకరరావు, భాను ప్రకాశ్, రవ్వ నాని, తెలుగు యువత నాయకులు బైరెడ్డి కళ్యాణ్, నాయకులు ఎం.లక్ష్మణరావు, మజ్జి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కార్యదర్శులు సమన్వయంతో కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అడ్మిన్, ఎమినిటీస్, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ కార్యదర్శుల మధ్య సమన్వయ లోపం ఉన్నట్లు గుర్తించామని, అందువల్ల ప్రతివారం కార్యదర్శులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించా మన్నారు. సచివాలయాల వారీగా ఆయా ప్రాంతాల్లో ఉన్న గుంతలు, ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. మూడు రోజులపాటు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ఎసిపిలు మధుసూదన్ రావు, అమ్మాజీ రావు, ఆర్ఒ శ్రీనివాసరావు, డిఇలు పాల్గొన్నారు.


లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ఎం ఎం నాయుడు నాయుడు సిబ్బందికి ఆదేశించారు. వర్షపు నీరు నిలిచిన ఉన్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జెసిబి సహాయంతో అడ్డంకులు తొలగించి పల్లపు ప్రాంతాలకు వర్షపు నీరు వెళ్లే విధంగా చేశారు. కంటోన్మెంట్, ఉడా కాలనీ తదితర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణకు అశోక్ విరాళం

ప్రజాశక్తి-విజయనగరంకోట

త్వరలో పునఃప్రారంభం కానున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు రూ.10వేల విరాళాన్ని అందజేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం అశోక్‌బంగ్లాకు వెళ్లి ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు రూ.10 వేల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న అశోక్



రమ్యను సత్కరిస్తున్న సీతం కళాశాల కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి, డైరెక్టర్ శశిభూషణరావు

యూనివర్సిటీ టాపర్‌కు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సీతం కళాశాలలో డిగ్రీ బిబిఎలో ఆంధ్రా యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన కె.రమ్యను శుక్రవారం సీతం కళాశాల కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి సత్కరించారు. రూ.50 వేలు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ పేదరికం చదువుకు, మనిషి ఎదుగుదలకు అడ్డుకాదని రమ్య నిరూపించిందన్నారు. ప్రతీ విద్యార్థి రమ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో రమ్య ఉన్నత చదువులకు వెళ్లినా, సివిల్స్‌కు సిద్ధమైనా సీతం కళాశాల నుంచి సహాయం ఉంటుందని డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు భరోసానిచ్చారు. కార్యక్రమంలో సీతం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ద్వివేదుల రామమూర్తి, సత్యా డిగ్రీ, పిజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయి దేవ మణి, డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ హెడ్ డాక్టర్ వరూధిణీ, తదితరులు పాల్గొన్నారు.


సెంచూరియన్‌లో బూట్ క్యాంప్

నెల్లిమర్ల : సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు బూట్ క్యాంప్‌ను శుక్రవారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ప్రారంభించారు. మూడో సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపనున్నారు. వాటిలో చంద్రయాన్, రొబోటిక్స్ అప్లికేషన్లు, విఎల్ఎస్పై చిప్ ఫ్యాబ్రికేషన్ తదితర ప్రాజెక్టులను చేపడుతున్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి దీంతో అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్ డాక్టర్ సన్నీడయాల్, ఐక్యూఎసి డీన్ డాక్టర్ పీఎస్వీ రమణారావు, డాక్టర్ సుబ్రత్ కుమార్ పరిడా, మురళీ, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ పరిశీలించారు.

దస్తావేజుల నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

కొన్నేళ్లుగా పంచాయతీలకు బకాయి ఉన్న దస్తావేజుల నిధులు సత్వరమే మంజూరు చేయాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మజ్జి రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆ నిధులను తక్షణమే పంచాయతీలకు జమచేయాలని కోరారు. గత ప్రభుత్వం మళ్లించిన ఆర్థిక సంఘం నిధులను కూడా గ్రామ పంచాయతీల ఖాతాల్లో వేయాలన్నారు. గతంలో ప్రతీ 3 నెలల వ్యవధిలో ఖజానా ద్వారా గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి నిధులు వచ్చేవని, ప్రస్తుతం ఆ నిధులు లేకపోవడంతో గ్రామ పంచాయతీల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా చిన్న పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. కనీసం పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన అన్ని నిధులను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో దుప్పలపూడి సర్పంచ్ వైకుంఠం విజయభాస్కర్ పాల్గొన్నారు.



కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్ల పంపిణీలో పాల్గొన్న జగదీష్‌బాబు, తదితరులు

కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్, ట్రైసైకిళ్లను ట్రస్ట్ చైర్మన్ జగదీష్ బాబు, మంగళపాలెం గ్రామ నాయకులు వికలాంగులకు అందజేశారు.

పన్నుల వసూలు వేగవంతం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆస్తిపన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్ను వసూలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఆస్తిపన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ షాపుల అద్దెలు వసూలు చేయాలన్నారు. సమావేశంలో ఆర్ఒ ప్రసాద్, ఆర్ఐ త్రినాథ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీలు రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. అండర్ 15,17 విభాగాల్లో పోటీలు నిర్వహించగా వంద మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షులు కెఎ నాయుడు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆసోషియేషన్ కార్యదర్శి నున్నా సురేష్, వై.కుసుంబచన్, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మాంసం దుకాణాల యజమానులకు పంచాయతీ కార్య నిర్వహణ అధికారి లక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆనుకొని ఉన్న మటన్, చికెన్, నూడిల్స్ దుకాణాల నుండి వచ్చే వ్యర్థాలు, దుర్వాసన వలన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని అందిన ఫిర్యాదుతో శుక్రవారం ఇఒ ఉన్నత పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలను అనుకొని ఉన్న దుకాణదారులతో ఆమె మాట్లాడారు మాంసపు వ్యర్థాలను ఎప్పటికప్పుడు క్లీన్ చేయకపోవడం వలన వర్షాలు వచ్చినప్పుడు అవి కుళ్లిపోయి క్లాస్ రూములలోకి దుర్వాసన వస్తుందని, వాటి వలన విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. మరొకసారి ఫిర్యాదు అందితే షాపులను తొలగించవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీష్ పంచాయతీ సిబ్బందిపాల్గొన్నారు.

మంచినీటి బావుల్లో క్లోరినేషన్

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని మంచినీటి బావులను మున్సిపల్ అధికారులు క్లోరినేషన్ చేస్తున్నారు. వర్షాలు కురవడంతో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు బావులను క్లోరినేషన్ చేస్తున్నట్లు కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. బావుల పరిసర ప్రాంతాలను బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ చెప్పారు.